ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
గురువారం 19 సెప్టెంబరు 2024

డ్రగ్స్ నియంత్రణకు టాస్క్‌ఫోర్స్

పరమేశ్వర్ అధ్యక్షతన ఏర్పాటు

బెంగళూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మాదకద్రవ్యాల నియంత్రణకు హోం మంత్రి పరమేశ్వర్ అధ్యక్షతన ఏడుగురు మంత్రులతో టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈమేరకు బుధవారం సీఎం సిద్ధరామయ్య ఉత్తర్వులు జారీ చేశారు. టాస్క్‌ఫోర్స్ కమిటీలో మంత్రులు దినేశ్‌గుండూరావు, కృష్ణబైరేగౌడ, ప్రియాంక ఖర్గే, శరణప్రకాశ్ పాటిల్, మధుబంగారప్ప, డాక్టర్ ఎంసీ సుధాకర్ సభ్యులుగా ఉంటారన్నారు.


జేడీఎస్ పగ్గాలు... కుమారకే..!

- జాతీయ అధ్యక్షుడి హోదా
- రాష్ట్ర అధ్యక్ష పదవి నిఖిల్‌కు..
- డిసెంబరులో నూతన పాలకవర్గం





కేంద్ర మంత్రి కుమారస్వామి



హెచ్‌డీ దేవేగౌడ

బెంగళూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జనతాదళ్ సెక్యులర్ (జేడీఎస్) పార్టీ జాతీయ అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం కొనసాగిన మాజీ ప్రధాని దేవేగౌడ స్థానానికి కేంద్రమంత్రి కుమారస్వామి రానున్నారు. జాతీయ అధ్యక్ష పదవి గడువు ఈనెలాఖరులో ముగుస్తోంది. రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రస్తుతం కుమారస్వామి కొనసాగుతున్నారు. ఈ హోదాకు కూడా గడువు సమీపిస్తోంది. రెండు పదవులకు రెండు నెలలు గడువు పొడిగించనున్నారు. పార్టీలోని అన్నివర్గాలతో చర్చించి తీర్మానించనున్నారు.

మరోసారి తండ్రీకొడుకులే...

జేడీఎస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా దేవేగౌడ కొనసాగుతున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రస్తుతం కుమారస్వామి ఉన్నారు. కానీ రాష్ట్ర అధ్యక్ష పదవిలో లోక్‌సభ ఎన్నికలకు ముందు దాకా ఇబ్రహీం ఉండేవారు. జేడీఎస్ పార్టీ బీజేపీతో పొత్తు పెట్టుకోవడంతో సెక్యులర్ సిద్ధాంతాలకు వ్యతిరేకమని ఇబ్రహీం అభ్యంతరం తెలిపారు. దీంతో ఉన్నపళంగా ఇబ్రహీంతోపాటు రాష్ట్ర కమిటీని జాతీయ అధ్యక్షుడు దేవేగౌడ రద్దు చేశారు. ఆ తర్వాత కుమారస్వామి రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించారు. ప్రస్తుతం జాతీయ అధ్యక్షుడిగా తండ్రి దేవేగౌడ, రాష్ట్ర అధ్యక్షుడిగా తనయుడు కుమారస్వామి ఉన్నారు. మార్పులు జరిగితే మరోసారి తండ్రీ కొడుకులదే హవా కానుంది. జాతీయ అధ్యక్షుడిగా కుమారస్వామి, ప్రస్తుతం జేడీఎస్ యువవిభాగం అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న కుమారుడు నిఖిల్ రాష్ట్ర అధ్యక్ష పదవికి ఎంపిక చేసే అవకాశం ఉంది. ఇలా మరోసారి జేడీఎస్ పార్టీకి జాతీయ, రాష్ట్ర అధ్యక్షులుగా తండ్రీ కొడుకులు కొనసాగే అవకాశం ఉంది. పార్టీని బలోపేతం చేయడం, సభ్యత్వ నమోదును కొనసాగించదలిచారు. అక్టోబరు తర్వాత సంస్థాగత ఎన్నికల ద్వారా తాలూకా, జిల్లా పదాధికారులను ఎన్నుకోదలిచారు. డిసెంబరు నాటికి జాతీయ, రాష్ట్ర అధ్యక్ష స్థానాలకు కొత్తవారు బాధ్యతలు చేపడతారు.

రెండేళ్లకోసారి కొత్త పాలకవర్గం

జేడీఎస్ రెండేళ్లకోసారి కొత్త పాలకవర్గాన్ని ఏర్పాటు చేసుకుంటోంది. రాష్ట్ర, జాతీయ అధ్యక్షులను, పదాధికారులను రెండేళ్లకోసారి నియమిస్తోంది. 2023లో నియమితులైన పదాధికారుల వ్యవధి ముగుస్తున్న తరుణంలో కొత్త అధ్యక్షులతోపాటు పదాధికారుల నియామకానికి కసరత్తు ప్రారంభించింది. మైసూరు ప్రాంతంలో జేడీఎస్ పార్టీ నిర్వీర్యమైందనే విమర్శలకు లోక్‌సభ ఎన్నికల్లో దీటైన ఫలితాన్నిచ్చాయి. ఉత్తర కర్ణాటక ప్రాంతంలో గడిచిన ఎన్నికల్లో గెలుపు సాధ్యమైంది. రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో కొనసాగుతున్న కేంద్రమంత్రి కుమారస్వామి పార్టీ ప్రాబల్యాన్ని పెంచుకోదలిచారు.



నిఖిల్

సభ్యత్వ నమోదుకు శ్రీకారం

బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసే దిశగా సభ్యత్వ నమోదుకు శ్రీకారం చుట్టారు. తాజాగా బుధవారం మైసూరులో యువ విభాగం అధ్యక్షుడు నిఖిల్‌కుమారస్వామి, జేడీఎస్ పక్షనేత సురేశ్‌బాబు ప్రక్రియను పారంభించారు. ప్రతి తాలూకాలో కనీసం 5వేలమందిని సభ్యులుగా చేయదలిచారు. ప్రతి జిల్లాలోనూ ప్రస్తుత, మాజీ ఎమ్మెల్యేలతో కూటమిని ఏర్పాటు చేశారు. సమైక్యంగా సభ్యత్వ నమోదును కొనసాగించదలిచారు. ఎమ్మెల్యేలు ఉన్నచోట ఎక్కువమంది సభ్యులను చేర్చాలని సూచించారు. అక్టోబరు నెలఖారుకు సభ్యత్వ నమోదు ముగించదలిచారు. ఈ ప్రక్రియ ముగియగానే సంస్థాగత ఎన్నికలు కొనసాగించనున్నారు. తాలూకా, జిల్లాస్థాయి పదాధికారులను ఎంపిక చేయడానికి కనీసం నెల రోజులు గడువు అవసరం. డిసెంబరులోగా అన్ని ప్రక్రియలు పూర్తి చేసి రాష్ట్ర అధ్యక్షుని, ఆ తర్వాత జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకుంటారు.

అనాదిగా ఏకగ్రీవమే...

పార్టీ బలోపేతంగా ఉన్నా కొన్ని జిల్లాలకే పరిమితంగా కొనసాగినా జాతీయ, రాష్ట్ర అధ్యక్షులను ఏకగ్రీవంగానే ఎన్నుకుంటారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు దేవేగౌడ తీర్మానమే శిరోధార్యంగా కొనసాగుతోంది. తాలూకా, జిల్లాస్థాయిలో పట్టు కోసం పోటీ పడినా రాష్ట్ర, జాతీయ అధ్యక్ష పదవులు మాత్రం ఏకగ్రీవంగానే ఎన్నుకుంటారు. రాష్ట్ర అధ్యక్ష పదవికి నిఖిల్ కుమార్‌ను ఎంపిక చేయడం ద్వారా భవిష్యత్తు నాయకుడిని చేయాలని తీర్మానించారు. దాదాపు ఏడాదిన్నర కాలంగా నిఖిల్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. దేవేగౌడ మరో కుమారుడు రేవణ్ణ రాజకీయాల్లో కొనసాగినా ఆయన కీలక పదవులలో కొనసాగింది లేదు. ఆయన కుమారులు ప్రజ్వల్, సూరజ్‌లకు ప్రజాప్రతినిధులుగా అవకాశం కల్పించారు. ప్రజ్వల్ హాసన్ ఎంపీగా, సూరజ్ ఎమ్మెల్సీ అయ్యారు. అయితే ఇరువురూ సెక్స్ కుంభకోణం కేసుల్లో పీకల్లోతులో కూరుకుపోయారు. వారిని పార్టీలోకి తీసుకొస్తే మరింత పరువు పోతుందని నిర్ణయించినట్టు తెలుస్తోంది.

కోర్టులో ఇబ్రహీం కేసు

2022 ఆగస్టులో జేడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఇబ్రహీంను ఎంపిక చేశారు. బీజేపీతో లోక్‌సభ ఎన్నికల్లో పొత్తు పెట్టుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఇదే కారణంతో 2023 అక్టోబరు 19న పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తొలగించారు. రాష్ట్ర కార్యవర్గ కమిటీని రద్దు చేశారు. తాత్కాలికంగా కుమారస్వామిని నియమించారు. ఇబ్రహీం కోర్టును ఆశ్రయించారు. జాతీయ అధ్యక్షుడిగా కేంద్రమంత్రి హెచ్‌డీ కుమారస్వామి, రాష్ట్ర అధ్యక్షుడిగా నిఖిల్‌కుమార్‌లను నియమించే అవకాశం ఉంది.

అక్రమాల గుర్తింపునకు ఏఐ సాంకేతికత..!

- గ్రామీణాభివృద్ధి శాఖలో నిఘా అమలు
- కేంద్ర పథకాల్లో అవినీతికి అడ్డుకట్ట



బెంగళూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పేదలు, కూలీ కార్మికుల ఆర్థిక స్వావలంబన జరపాలని పల్లె ప్రాంతాల్లో అభివృద్ధి పథకాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా కోట్లాది రూపాయలు విడుదల చేస్తున్నాయి. అభివృద్ధి పథకాల అమలులో అక్రమాలు జరిపి కోట్లాది రూపాయల లూటీ చేస్తున్న విషయాన్ని గ్రామీణాభివృద్ధిశాఖ తీవ్రంగా పరిగణించింది. ఇలాంటి అక్రమాలను గుర్తించి ప్రభుత్వ గ్రాంట్లు అక్రమార్కుల జేబులకు చేరకుండా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా కట్టడి చేయదలిచారు. వైద్య ఆరోగ్య, వ్యవసాయ, విద్యాశాఖ, బ్యాంకింగ్, ఈ-కామర్స్ పారిశ్రామిక రంగాలతోపాటు పలు విభాగాలలో ఏఐ టెక్నాలజీని గ్రామీణాభివృద్ధి చేసి శాఖలతో కార్యాచరణ ప్రారంభించనుంది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై), ప్రధానమంత్రి గ్రామీణరస్తా యోజన, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ పథకం, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తదితర పథకాలలో అక్రమాలు పెరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ పథకాల ప్రారంభం నుంచే విమర్శలు ఎదుర్కొంటున్నాయి. వేలాదిమందికి పల్లెల్లోనే ఉపాధి కల్పిస్తున్నా అక్రమాలు కూడా దారి తప్పేలా మారాయి. కేంద్ర ప్రభుత్వ పథకాలలో సాగుతున్న అవినీతిని నియంత్రించేందుకు గ్రామీణాభివృద్ధిశాఖ ఏఐ టెక్నాలజీని సద్వినియోగం చేసుకోదలిచింది. ఏఐ సాంకేతికంతో కొన్ని సమస్యలు ఉన్నా వేగవంతంగా పనులు, స్పష్టమైన రికార్డుల పరిశీలన, వ్యత్యాసాలకు సవరణలకు అవకాశం లేని విధానం అనుకూలం కానున్నాయి. ఆక్స్‌ఫర్డ్ ఏఐ రెడినెస్ ఇండెక్స్ ప్రకారం దేశం ఏఐ టెక్నాలజీ సద్వినియోగంలో 40వ ర్యాంకులో ఉంది.

ప్రధానమంత్రి ఆవాస్ యోజన, పీఎంఎస్‌బీవై, నరేగాలలో అక్రమాలు పెరిగాయనే విమర్శలు ఉన్నాయి. తప్పుడు రికార్డులు సృష్టించి వాటికి అనుబంధంగా బిల్లులను సరిచేసి కోట్లకొలదీ గ్రాంట్లు కాజేస్తున్నారు. అక్రమాల గుర్తింపుకోసం ఏఐఎంఎల్‌ను అనుసంధానం చేయనున్నారు. ఆవాస్ సాఫ్ట్, ఏరియా ఆఫీసర్‌యాప్ ఎను అభివృద్ధి చేశారు. పనులు కొనసాగిన తీరుకు సంబంధించి ప్రతి వివరాలను ఏఐ సాంకేతికం పరిశీలించనుంది. రికార్డులలో తప్పులుంటే వెంటనే గుర్తించనుంది. అనుమానాస్పద ఆర్థిక వ్యవహారాలు, పన్నుల చెల్లింపు తదితరాలు ఇకపై సులభతరం కానున్నాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఉపాధి హామీ పథకంలో పర్యవేక్షించే ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఒకప్పుడు జాబ్‌కార్డులను పరిశీలించేవారు. ఆ తర్వాత వీడియోకాల్ రూపంలో పరిశీలించేవారు, అయితే ఒకే ఫొటోను పలు చోట్ల తీయడం, ఒక బృందం నాలుగైదు చోట్ల పనిచేస్తున్నట్టు వంటి అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఫొటో వాస్తవాన్ని పరిశీలించనుంది.

పలు విభాగాల్లో ఏఐ

ప్రభుత్వ ఈ-మార్కెట్‌లలో అవినీతిని గుర్తించడం, జీఎస్టీ, భాషా సేవలకు సంబంధించి, జాతీయ భాషా టెక్నాలజీ విషయంలో జారీ చేయడం, దేశంలోని పలు భాషలు, 350 ఏఐ భాషలలో విడుదల చేశారు. రైతులకు పీఎం కిసాన్ ప్రాజెక్టు సమాచారం ఇవ్వడం, సుప్రీంకోర్టు తీర్పు ప్రాంతీయ భాషలలో అనువాదం చేయడానికి ఏఐ సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. సువాస్ యాప్ అభివృద్ధి చేసి ఏఐ సేవలను విస్తారం చేయదలిచారు. రైల్వే సేవల్లోనూ ఏఐ ద్వారా సరికొత్త సంస్కరణలు తీసుకురాదలిచింది.

అవినీతి వెలుగులోకి..

గ్రామీణాభివృద్ధిశాఖ సోషల్ ఆడిట్ కమిటీలో కమిటీ ప్రకారం 2022-23లో రాష్ట్రంలో నరేగా ద్వారా ఏకంగా రూ.181 కోట్లు అవినీతి జరిగినట్టు నిరూపితమైంది. దేశవ్యాప్తంగా నరేగా పథకాల అక్రమాలకు సంబంధించి 4.92 లక్షల కేసులు నమోదయ్యాయి. సుమారు 1,102 కోట్ల రూపాయలు అవినీతి జరిగినట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో పలువురు పర్యవేక్షకులే అక్రమాలకు పాల్పడినట్టు తెలుస్తోంది. పనులు చేసిన కూలీలకు వివిధ కారణాలతో బిల్లులు రాకుండా చేసి వారికి అనుకూలమైనవారికి జాబ్‌కార్డులలో పేర్లు నమోదు చేసి బిల్లులు లూటీ చేసినట్టు విమర్శలు ఉన్నాయి. రాష్ట్రంలో నరేగా ద్వారా కోట్లాదిరూపాయల అవినీతి జరిగినా వాటిని రికవరీ చేయడం సాధ్యం కాలేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో కేంద్రప్రభుత్వం కూడా మంజూరు చేసిన గ్రాంట్లను సజావుగా వినియోగించుకోవాలని, అవినీతికి చెక్ పెట్టాలనే ఏఐ సాంకేతికతను సద్వినియోగం చేయదలిచారు.

మంత్రి తిమ్మాపురపై భూఆక్రమణ ఆరోపణలు

- అటవీ, రెవెన్యూ భూమిపై వివాదం



బెంగళూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ముడా ఇంటి స్థలాల వివాదంలో సీఎం సిద్దరామయ్య ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలోనే ఎక్సైజ్‌శాఖ మంత్రి ఆర్‌బీ తిమ్మాపురపై భూ ఆక్రమణల ఆరోపణలు వచ్చాయి. ఆర్‌బీ షుగర్స్ ఫ్యాక్టరీపై రాయచూరు జిల్లా రైతులు మంగళవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. సుణకల్ సమీపంలో భూమిని కొనుగోలు చేశారు. అందుకు అనుబంధంగా ఉండే భూమిని స్వాధీనం చేసుకున్నారని స్థానికులు ఫిర్యాదులో పేర్కొన్నారు. చిక్కఉప్పేరి గ్రామ సర్వే నంబరు 62లో ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నారని ఆరోపించారు. మూడు నాలుగు నెలలుగా భూమి చదును చేసే పనులు కొనసాగిస్తున్నారన్నారు. రైతుసంఘం ప్రతినిధులు ఫిర్యాదు చేసేదాకా అధికారుల దృష్టికి రాలేదు. సుమారు 60 ఎకరాల భూమిని కొనుగోలు చేయగా 90 ఎకరాలకుపైగా భూమిలో పనులు చేయడం సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

దర్శన్‌ను కలిసిన భార్య, బంధువులు



జైలులో దర్శన్‌ను కలవడానికి వెళుతున్న భార్య విజయలక్ష్మి, నటుడు ధన్వీర్, బంధువులు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 18: రేణుకాస్వామి హత్యకేసులో నిందితుడు దర్శన్‌ను అతని భార్య విజయలక్ష్మి, నటుడు ధన్వీర్ బంధువులు హేమంత్, సుశాంత్‌నాయుడు మంగళవారం సాయంత్రం బళ్లారి జైల్లో కలిశారు. విజయలక్ష్మి చిరుతిళ్ల ఉన్న రెండు బ్యాగులు తీసుకొచ్చి విజిటర్స్ రూంలో దర్శన్‌కు ఇచ్చినట్లు తెలుస్తోంది. విజిటర్స్ రూం నుంచి తిరిగి వస్తుండగా దర్శన్ చేతిలో ఆ రెండు బ్యాగులు కనిపించాయి. సాధారణంగా బళ్లారి జైల్లో రక్తసంబంధీకులు మినహా ఇతరులు ఖైదీలను కలవడానికి అనుమతి ఉండదు. అయితే జైలు మార్గదర్శకాల ప్రకారం స్నేహితులు, శ్రేయోభిలాషుల సందర్శనలను అనుమతించాలని మంగళవారం కోర్టు సూచించడంతో ధన్వీర్, హేమంత్ తదితరులు దర్శన్‌ను కలుసుకోగలిగారు. సెప్టెంబరు 30వరకు జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు, బెయిల్ దరఖాస్తు, న్యాయపోరాటం తదితర అంశాలపై దర్శన్ తన భార్యతో చర్చించినట్టు తెలుస్తోంది. తనను పరామర్శించేందుకు తల్లి రాకపోవడంతో దర్శన్ మనస్తాపానికి గురయ్యాడని సందర్శకులు చెబుతున్నారు.



జైల్లోకి తిరిగి వెళ్తున్న దర్శన్

సర్కారుపై సంతృప్తి లేదు

- మరోసారి బీఆర్ పాటిల్ అసంతృప్తి



బెంగళూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మంత్రివర్గ సమావేశాన్ని కలబురగిలో జరపడం సమంజసమే ఉండవచ్చుగానీ నాకు సంతృప్తి లేదని సీనియర్ ఎమ్మెల్యే, సీఎం సలహాదారుడు బీఆర్ పాటిల్ మరోసారి సర్కార్‌పై తిరగబడ్డారు. కలబురగిలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ కల్యాణ కర్ణాటకకు రూ.5వేల కోట్లు రావడం, మైసూరు ప్రాంత వాసులకు కడుపుమంట అయ్యిందన్నారు. సభలో కొన్ని విషయాలు హడావుడిగా చర్చించారని, సమగ్రత లేకుండా పోయిందన్నారు. భూగర్భజలాలు పెంచేందుకు కనీసమైన చర్చ లేదన్నారు. జలజీవన్ పథకం బాగుందని, అయితే నీరు ఎక్కడనుంచి తీసుకొస్తారనేది ప్రకటించాలన్నారు. కలబురగి కేబినెట్‌లో మరిన్ని అంశాలపై చర్చ జరగాల్సి ఉండేదన్నారు.

నగరంలో గుంతలపై..

ఎంపీ పీసీ మోహన్ పోస్టు బూమరాంగ్



బెంగళూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): బెంగళూరు సెంట్రల్ ఎంపీ పీసీ మోహన్ నగరంలో గుంతలపై చేసిన వ్యాఖ్యలు బూమరాంగ్ అయ్యాయి. 15 రోజుల్లోగా గుంతలు పూడుస్తామని చెబుతున్నారని, గుంతల కథ ఏమోగానీ జేబులు నింపుకున్నారంటూ వ్యంగ్యంగా ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. దీంతో నెటిజన్లు ఆయనపై తిరగబడ్డారు. 15ఏళ్లుగా ఎంపీగా ఉన్నావు, ప్రజాసమస్యలపై ఎప్పుడైనా స్పందించావా..? అని నిలదీశారు. బీబీఎంపీ, ప్రభుత్వం నగర వ్యాప్తంగా గుంతలు పూడ్చే పనిలో నిమగ్నమైందని పేర్కొన్నారు. '15 ఏళ్ల వ్యవధిలో మీ నియోజకవర్గం ఎలా ఉందో ఒక్కసారైనా పరిశీలించారా?' అని ప్రశ్నించారు. ఆ పోస్టుపై ఆయనకు మద్దతు తెలిపినవారి కంటే విమర్శలు చేసినవారే ఎక్కువ ఉన్నారు.

బహుభాషా నటి శకుంతల కన్నుమూత



బెంగళూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బహుభాషా నటి శకుంతల (84) బెంగళూరులో గుండెపోటుతో కన్నుమూశారు. ఇటీవల కొంతకాలంగా వయోసహజ సమస్యలతో ఇబ్బంది పడుతుండేవారు. మంగళవారం గుండెపోటు రావడంతో సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్సలు ఫలించక కన్నుమూశారు. డ్యాన్సర్‌గా సినిమా ఇండస్ట్రీలోకి ప్రవేశించిన శకుంతల తమిళ, కన్నడ, తెలుగు, మలయాళ సినిమాలలో హీరోయిన్‌గా రాణించారు. శివాజిగణేశన్, ఎంజీఆర్, జయశంకర్ వంటి నటులతో కలసి ఆమె పలు సినిమాలు చేశారు. 1970లో జయశంకర్ నటించిన సీఐడీ శంకర్ ద్వారా సినిమాలలోకి వచ్చారు. తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లా అరసిపాళ్యం ఆమె స్వగ్రామం. కొన్ని టీవీ సీరియల్స్‌లో నటించిన ఆమె వయస్సు పైబడడంతో కుమార్తె ఇంట్లో ఉండేది. శకుంతల మృతి పట్ల సినీ రంగానికి చెందిన ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

గ్లోబల్ నావిగేషన్ దిశగా భారత్

- ఎయిర్ వైస్‌మార్షల్ డీవీ కోట్



వ్యోమగామి వేషధారణ పాయింట్ వద్ద సందడి




సదస్సులో మంత్రి ప్రియాంకఖర్గే, ఎయిర్ వైస్‌మార్షల్ కోట్ తదితరులు



స్పేస్ సెంటర్ నమూనా

బెంగళూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్లోబల్ నావిగేషన్ ఆధిపత్యం దిశగా భారత్ దూసుకెళుతోందని ఎయిర్ వైస్‌మార్షల్ డీవీ కోట్ అభిప్రాయపడ్డారు. అంతరిక్షం, భూమి వినియోగదారుల విభాగాలలో గ్లోబల్ లీడర్ ఇండియన్ కాన్సన్‌ట్రేషన్ మోడల్‌తో నావిగేషన్లు సద్వినియోగం చేసుకుంటోందని పలువురు అభిప్రాయపడ్డారు. బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్ (బీఐఈసీ)లో బుధవారం బెంగళూరు స్పేస్ ఎక్స్‌పో-2024 ప్రారంభమైంది. భారత అంతరిక్ష పరిశ్రమల ద్వారా సెక్టోరల్ వ్యాపారాలను అన్వేషించడం అనే అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు, ప్రదర్శనలు జరగనున్నాయి. భారత అంతరిక్ష వ్యవస్థకు సంబంధించి దశాబ్ద విజన్ రోడ్డుమ్యాప్‌పై డీవీ కోట్ కీలక ప్రసంగం చేశారు. ఉపగ్రహాలు నిర్మించడం, నిర్వహించడం ద్వారా ప్రభుత్వేతర సంస్థలను ప్రోత్సహించడంపై దేశం దృష్టి సారించాలన్నారు. శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్ ద్వారా డిజిటల్ కవరేజ్ నిర్ధారించడం సాగుతోందన్నారు. థాపర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్ పద్మకుమార్ నాయర్ మాట్లాడుతూ అంతరిక్ష సాంకేతికత భారతదేశానికి అత్యుత్తమ ప్రయాణాన్ని ప్రారంభించే అవకాశం కల్పిస్తోందన్నారు. తయారీ రంగంలో ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్ రంగంలో కంటే ఐటీ రంగంలో విప్లవం సాధించిందన్నారు. ఎల్‌అండ్‌టీ వైస్‌ప్రెసిడెంట్ లక్ష్మేశ్ మాట్లాడుతూ లాంచ్‌వెహికల్ మ్యానుఫ్యాక్చరింగ్‌లో ఇస్రోకు ప్రైవేట్ సహకారం కూడా ఉందన్నారు. అంతరిక్ష పరిశోధనల్లో మన సామర్థ్యాలను పెంపొందించుకోవడంతోపాటు ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడంలో కీలకపాత్ర పోషిస్తున్నామని ఐటీబీటీ శాఖ మంత్రి ప్రియాంక ఖర్గే అభిప్రాయపడ్డారు. సదస్సులో మంత్రి మాట్లాడుతూ కర్ణాటకలో అత్యాధునిక పరిశోధన అభివృద్ధి కేంద్రంగా తీర్చడమే లక్ష్యమన్నారు. ఇక్కడ ఆలోచనలు అభివృద్ధి చెందుతాయని, పరివర్తన పరిష్కారాలు ఉద్భవిస్తాయన్నారు. రాష్ట్ర జీడీపీ 2035 నాటికి 8.5కంటే పెరుగుతుందన్నారు. ఇది విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించడంలో అగ్రగామి కానుందన్నారు. ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ చైర్మన్ డాక్టర్ పవన్ కే గొయాంకో మాట్లాడుతూ నాలుగేళ్లలో అంతరిక్షరంగంపై ఆసక్తి పెరిగిందన్నారు. స్టార్టప్‌లసంఖ్య ఐదేళ్లలో ఐదు రెట్లకు పెరిగాయన్నారు. ఆర్థిక వ్యవస్థ ప్రపంచప్రభావంతో సహా అన్ని రంగాలలో దేశం పటిష్టంగా మారేందుకు కారణమైందన్నారు. నిరంతరంగా సదస్సులు కొనసాగాయి. అంతరిక్ష పరిశోధనలకు సంబంధించి ఏర్పాటైన ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1632.00	1,621.74
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	23,314	1778
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	21,358	9,924
సామర్థ్యం (టీఎంసీలు)	101.77	66.34

సేవను గుర్తించినపుడే సత్కారం



సత్కారం అందుకున్న వివిధ రంగాల ప్రముఖులు

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 18: సేవను గుర్తించినపుడు సత్కారం లభించడం సర్వసాధారణమని, అయితే సత్కారంతో సమాజ బాధ్యత మరింత పెరుగుతుందని బసవరాజేశ్వరి పబ్లిక్ స్కూల్ అధ్యక్షుడు డాక్టర్. జె.వి. మహిపాల్ అభిప్రాయ పడ్డారు. బళ్ళారి యాక్టివిటీస్ అసోసియేషన్ సంస్థ స్థాపించి 52ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం నగరంలోని బసవరాజేశ్వరి పబ్లిక్ స్కూల్‌లో కళా దిగ్గజాల పేరుతో వివిధ రంగాల్లో సేవలు అందించిన విజేతలకు, ఉత్తమ ఉపాధ్యాయులకు, ఎక్కువ మార్కులు పొందిన విద్యార్థులకు ప్రశస్తి ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళ, కళాకారులు, సాహితి, విద్యార్థులు సాధనను గుర్తించి వారిని సన్మానించడం గర్వంగా భావించాలన్నారు. ఈ సందర్భంగా 2024 సంవత్సరం ప్రశస్తికి ఎన్నికైన కళాకారులకు ఉగాది పురస్కారాలు అందజేయడంతో పాటు వివిధ రంగాల్లో సేవలు అందించిన సాధకులకు, కళాకారులు, విద్యార్థులను సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ రకాల పోస్టల్ స్టాంప్ ప్రదర్శన సభికులను ఆకట్టుకుంది. కళ్యాణస్వామి ఆధ్వర్యంలో జరిగిన విశేష కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌రాజ్, ఉపాధ్యక్షులు పి.గాదెప్ప, అసిస్టెంట్ సెక్రటరీ వి.రామచంద్రప్పలు ముఖ్య అతిథులుగా పాల్గొనగా సంస్థ అధ్యక్షుడు కార్యక్రమానికి స్వాగతం పలికారు.

అబాకస్ పోటీల్లో రాణించిన కంప్లి విద్యార్థులు



బహుమతులు గెలుచుకున్న కంప్లి విద్యార్థులు

కంప్లి, సెప్టెంబరు 18: కొప్పళలో ఈనెల 14, 15 తేదీల్లో జరిగిన అబాకస్ 6వ రాష్ట్రస్థాయి పోటీల్లో కంప్లి విద్యార్థులు 68 మంది రాణించి అవార్డులు దక్కించుకున్నారు. బెళ్లద గిరీష్ అనే విద్యార్థి ఎంతో నైపుణ్యంతో రాష్ట్ర స్థాయికి ఎన్నికయ్యాడు. ఇంకా సుబ్రహ్మణ్యం, రితిక, అభిషేక్, అమరేష్, ఆద్య, సచిన్, నవీన్, తదితరులు కూడా రాణించి గుర్తింపు పొందారు. గిరీష్ రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందడంతో తల్లిదండ్రులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు. వారితో పాటు భారతి, వైష్ణవి, శిల్ప, సంతోష్‌లు పాల్గొన్నారు.


ఇంటిస్థలాలు కేటాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌యూసీఐ దేవదాస్

బళ్లారి గాంధీనగర్, సెప్టెబరు 18: శ్రీధరగడ్డ గ్రామంలో నిరుపేదలకు ఇంటిస్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్‌యుసిఐ కమ్యూనిస్ట్ పార్టీ బుధవారం బళ్లారి తాలూకా కార్యాలయం ముందు ఆందోళన చేపట్టింది. ఎస్‌యూసీఐ గ్రామీణ సమితి కార్యదర్శి ఎ.దేవదాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇప్పటికే ఆశ్రయ యోజన క్రింద ఇళ్ళులేని వారికి ఇంటిస్థలాలు పంపిణీ చేసేందుకు 10.36 ఎకరాల స్థలాన్ని 2000సంవత్సరంలోనే శ్రీధరగడ్డ గ్రామంలో స్వాధీనం చేసుకుందన్నారు. అయితే స్థలం స్వాధీనం చేసుకుని 24 సంవత్సరాలు గడిచినా ఇంతవరకు ఇంటిస్థలాలు పంపిణీ కాలేదన్నారు. లబ్దిదారుల జాబితా అధికారులు సిద్దం చేసినా ఇళ్ళ స్థలాల పంపిణీ కోసం అధికారులు చర్యలు చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుచేత సంబంధిత అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని కోరుతూ తాలూకా పంచాయతీ ఇఓ బసప్పకు మనవి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టిపి ఇఓ బసప్ప మాట్లాడుతూ వీలైనంత త్వరలో స్థలాల పంపిణీ కోసం కృషి చేస్తామని చెప్పారు.

అటవీభూములు అన్యాక్రాంతం



- బళ్లారిలో 51,77ఎకరాల అడవులను ఆక్రమించిన కబ్జాదారులు
- పట్టాలు సృష్టించి అమ్ముకుంటున్న వైనం
- అక్రమార్కులకు నోటీసులు జారీ చేసిన అధికారులు

బళ్లారి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆక్రమణదారులకు అదీ..ఇదీఅనేది ఏముండదు. కనిపించిన చోటల్లా పాగా వేసేయడమే. బళ్లారిలో కొందరు ఏకంగా అటవీ భూములనే ఆక్రమించారు. వాటికి అక్రమంగా పట్టాలు కూడా పొందారు. మరి కొందరు సాగుకింద వాడుకుంటున్నారు. సాగు చేసుకుంటే ఏదో పోనీ లే అనుకోవచ్చు. కానీ ఏకంగా పట్టాలు పొంది ఆ భూమిని ఇతరులుకు విక్రయానికి కూడా పెట్టేశారు. అటవీశాఖ అధికారుల సమాచారం ప్రకారం బళ్లారి జిల్లాలో విస్తారంగా అటవీ భూములు ఉన్నాయి. ఇందులో ముఖ్యంగా సండూరు ప్రాంతంలో ఎక్కువగా ఉన్నాయి. వివిధ ప్రాంతాల్లో సుమారు 5177.24 ఎకరాల భూమి అక్రమణలకు గురైనట్లు అటవీశాఖ గుర్తించింది. సండూరు ప్రాంతంలోనే ఇప్పటి వరకూ 2228 మందిపై కేసులు నమోదు చేశారు. ఇందులో 2228 కేసులకు గాను 2208 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. మిగిలిన వాటిని కొంత వరకూ క్లియర్ చేశారు. సండూరు ప్రాంతంలో ఉండే అటవీభూములకు కొందరు అక్రమంగా పట్టాదారు పాసుపుస్తకాలు సృష్టించి విక్రయించారు. అటవీశాఖ భూములపై కొందరు పెత్తందార్లు నడుపుతున్న ఈ తంతుపై అటవీశాఖ కొరడా ఝుళిపించింది. ఆక్రమణదారులకు అటవీశాఖ సీసీఎఫ్‌వో నోటీసులు జారీ చేశారు. ఇది రికార్డుల ప్రకారం అటవీశాఖకు చెందినది కనుక వెంటనే భూమి నుంచి తొలగిపోవాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఒకవేళ ఇది మీ సొంత భూమి అనుకుంటే అందుకు సంబంధించిన రికార్డులు, ఆధారాలు తీసుకుని రావాలని అటవీశాఖ నోటీసులు జారీ చేసింది. ఇప్పటి వరకూ అక్రమణలు చేసిన వారిలో రాజకీయ నాయకుల అనుచరులు, రాజకీయ పలుకుబడి ఉండేవాళ్లు ఎక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కొందరు భూములు లేని రైతులు అటవీభూమిని ఆక్రమించుకుని జీవనం సాగిస్తున్నారు. అలాంటి వారి విషయాన్ని అటవీశాఖ సీరియస్‌గా తీసుకోకుండా భూమిని అక్రమించి పట్టాలు సృష్టించి విక్రయాలు చేసే వారిపై క్రిమినల్ కేసులను నమోదుచేసినట్టు తెలుస్తోంది. ఈ కేసులన్నీ విచారణ దశలో ఉన్నప్పటికీ, లబ్దిదారులు వీటిపై కోర్టుకెళ్లే అవకాశమున్నట్టు తెలుస్తోంది.

రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ నిరసన

- రాష్ట్ర ప్రభుత్వం పడిపోవడం ఖాయమన్న నారాయణస్వామి
- కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఎస్సీ, ఎస్టీ మోర్చా నాయకుల నినాదాలు

రాయచూరు సెప్టెంబర్ 18 :రిజర్వేషన్‌ల రద్దుకు సంబంధించి అమెరికా వేదికగా కాంగ్రెస్‌పార్టీ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను బీజేపీ నాయకులు తప్పుబట్టారు. ఇందుకు నిరసనగా బీజేపీ ఎస్సీఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో బుధవారం రాయచూరు నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ప్రదర్శనలో మాట్లాడిన సీనియర్ నాయకుడు నారాయణ స్వామి, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం బీజేపీ నాయకులను టార్గెట్ చేసుకుని వేధింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. నిజంగా ఇదే పరిస్థితి కొనసాగితే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండదని, పడిపోతుందని జోస్యం చెప్పారు. కాగా యాదగిరిలో పీఎస్ఐ మృతికి సంబంధించి ఎమ్మెల్యే, ఆయన కుమారుడిని కాంగ్రెస్ ప్రభుత్వమే రక్షిస్తోందని ఆరోపించారు. ఆయన మరణించి రెండు నెలలు దాటిన అనంతరం పోస్ట్‌మార్టం నివేదికలో గుండెపోటు అని చిత్రీకరించడం దారుణమన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి, రాహుల్ గాంధీకి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేఖంగా ఎస్సీ, ఎస్టీ మోర్చా నాయకులు పెద్దఎత్తున నినాదాలు చేశారు.



రాయచూరు నగరంలో ఆందోళన చేస్తున్న బీజేపీ శ్రేణులు

కులాంతర వివాహాలకు పెరిగిన ఆదరణ


- ప్రతి జంటకు రూ.3 లక్షల ప్రోత్సాహక బహుమతి



బళ్లారి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కులాంతర వివాహాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. వివాహాలు చేసుకున్న వారికి రూ. 3లక్షల వరకూ ప్రోత్సాహక ధనం అందిస్తున్న నేపథ్యంలో కులాంతర వివాహాలు బాగా పెరుగుతున్నాయి. ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన పురుషుడు ఇతర కులాలకు చెందిన స్త్రీలను వివాహం చేసుకుంటే రూ. 2.5 లక్షలు, అదే ఎస్సీ, ఎస్టీ కులానికి చెందిన స్త్రీ ఇతర కులాల వారిని పెళ్లి చేసుకుంటే రూ. 3లక్షలు ప్రభుత్వం ప్రోత్సాహక బహుమతిగా ప్రటించింది. వివాహం చేసుకున్న ఏడాది లోపు వీరు ఆల్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం వీరి బ్యాంకు ఖాతాకు ఆ బహుమతిని జమ చేస్తుంది. 2021 నుండి 2024 వరకూ మొత్తం 148 కులాంతర వివాహాలు జరిగాయని సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ తెలిపారు. బళ్లారి జిల్లాలో 97, సిరుగుప్ప తాలూకాలో 23, సండూరులో 28, వివాహాలు జరిగినట్లు ఆయన వెల్లడించారు. ఈ కులాంతర వివాహాలను కొన్ని ఉన్నత వర్గాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. సిద్ధరామయ్య సర్కారుపై నిప్పులు చెరుగుతున్నాయి. రాజకీయ దురుద్దేశంతో ఇలా చేస్తున్నారని కొన్ని వర్గాలవారు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. ఇందువలన అనేక సామాజిక సమస్యలు ఏర్పడుతాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్‌వైఎంసీ కళాశాలలో ఘనంగా ఇంజనీర్స్ డే

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 18: నేడు సాంకేతికంగా మనం ఎంత అభివృద్ధి చెందినా... సాంకేతిక రంగానికి పునాదులు వేసిన వారిని మరవరాదని ప్రజా పనుల శాఖ బళ్ళారి విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హేమరాజు అన్నారు. సర్ ఎం. విశ్వేశ్వరయ్య సాంకేతిక రంగంలో వేసిన బాటలను ప్రతి విద్యార్థి అలవరుచుకుని ముందుకు సాగాలని ఆయన పేర్కొన్నారు. సర్ ఎం. విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుని నగరంలోని రావ్‌బహదూర్ వై మహాబళేశ్వరయ్య ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఘనంగా ఇంజనీర్స్ దినోత్సవాన్ని కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం జరుపుకుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రెసిడెంట్ ఆఫ్ ఏసిసిఈఎ అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్ ఆర్కిటెక్చర్ ఈశ్వర గౌడ మాట్లాడుతూ సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రాధాన్యత గురించి వివరించారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగం అన్ని విభాగాలకు తల్లిస్థానం లేదా మూల స్థానంగా చెప్పవచ్చని విద్యార్థులకు తెలియజేశారు. కళాశాలలో చదువుతున్న ఇంజనీరింగ్ విద్యార్థులు కఠిన శ్రమతో లక్ష్యసాధన దిశగా వెళ్ళి ఉత్తమ ఇంజనీర్లుగామారి దేశానికి సేవలు అందజేయాలని కోరారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షులు జానెకుంట బసరాజుతో పాటు సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రముఖులు డాక్టర్ హెచ్.ఎం. మల్లికార్జున, ఇంజనీర్ ఈశ్వరగౌడ, సవితా సోనోళి, అతిథులు హేమరాజ్‌లను సన్మానించి సత్కరించారు.



విశ్వేశ్వరయ్యకు నివాళులు అర్పిస్తున్న ఆర్‌వైఎంసీ కళాశాల సిబ్బంది

బ్యాంకు అధికారుల ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్



పరిసరాలను శుభ్రం చేస్తున్న బ్యాంకు సిబ్బంది

బళ్లారిరూరల్, సెప్టెంబరు 18: బళ్లారి నగరంలో కెనరా బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారుల ఆధ్వర్యంలో బుధవారం బ్యాంకు పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ గిరీష్ కులకర్ణి మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా వుంచుకోవాలని అశుభ్రత వల్ల పట్టణంలో వ్యాధులు వ్యాపిస్తాయని అన్నారు. చెత్తా చెదారాన్ని ఎక్కడపడితే అక్కడ వేయరాదని ప్రతి ఒక్కరు స్వచ్ఛతా సేవలో పాలుపంచుకుంటే, మన నగరంతో పాటు దేశం కూడా శుభ్రంగా వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంకుమేనేజర్ నారాయణ, బ్యాంకు అధికారులు రమేష్, దినేష్‌కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా వద్ద బ్యాంక్ మేనేజర్‌తో కలిసి సిబ్బంది స్వచ్ఛభారత్ సేవ నిర్వహించారు.

వైభవంగా ఉచ్చీరప్ప తాత పల్లకి ఉత్సవం



చలువప్ప, ఉచ్చీరప్ప తాతల పల్లకి ఊరేగింపు

సిరుగుప్ప, సెప్టెంబరు 18 : అంగరంగ వైభవంగా చలువప్ప, ఉచ్చీరప్ప తాతల పల్లకీ ఊరేగింపు బుధవారం జరిగింది. సిరుగుప్ప పట్టణం 24వ వార్డులో వెలసిన చలువప్ప, ఉచ్చీరప్ప తాతల ఆలయంలో ప్రతి యేడాది మాదిరిగానే రెండు రోజుల పాటు సప్తభజన కార్యక్రమాన్ని చేశారు. ఉదయం నుంచి పేటే ఆంజనేయస్వామి ఆలయం వరకు తాళమేళాలు, డోలు ఢమరులతో, వివిధ వేషభూషణలతో పల్లకీ ఊరేగింపు నిర్వహించారు. నందికోళ్ల ప్రదర్శన జరిగింది. టపాసులు పేల్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు ఉచ్చీరప్ప, కార్యదర్శి శరణప్ప, ఓంకారప్ప, వీరేష, అర్చకులు ఉచ్చీరప్ప, బసవ రాజు స్వామి, భక్తులు పాల్గొన్నారు.

కాలువలో గుర్తుతెలియని శవాలు లభ్యం

కంప్లి, సెప్టెంబరు 18 : కంప్లి తాలుకా పరిధిలోని కొట్టాల రోడ్డు సాయి బాబా దేవస్థానం వద్ద బుధవారం ఉదయం మహిళ గుర్తు తెలియని శవం లభ్యమైంది. అలాగే బళ్లారి రోడ్డులోని ఎల్ఎల్‌సీ కాలువ వద్ద గుర్తు తెలియని వృద్దుని మృతదేహం లభ్యమైంది. ఉదయం అటు వైపు వెళుతున్న రైతులు శవాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెంటనే పోలీసులు పోస్టుమార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని కంప్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నూతన భవనాల ప్రారంభం



దేవలాపురంలో నూతన కట్టడాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

కంప్లి, సెప్టెంబరు 18 : తాలుకా పరిధిలోని దేవలాపురం గ్రామంలో ఎమ్మెల్యే జేఎన్ గణేష్ పంచాయతీ నూతన భవనాన్ని బుధవారం ప్రారంభించారు. ఉపాధి హామీ పనుల కింద రూ. 30 లక్షల వ్యయంతో ఈ నూతన కట్టడాలను పూర్తిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే కంప్లి నియోజకవర్గంలో పలుచోట్ల గ్రామ పంచాయతీల కోసం ఏర్పాటైన నూతన భవనాలను ప్రారంభిస్తామన్నారు. అలాగే త్వరలోనే కంప్లి వాల్మీకి సర్కిల్ నుంచి బళ్లారి రోడ్డు, రామసాగర రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేపడతామన్నారు. ఇకపై ఏ గ్రామంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా తమకు తెలిపితే వెంటనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అధ్యక్షులు రమేష్, శివకుమార్, మల్లన్నగౌడ, వాసప్ప, ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రతిభా కారంజి వేడుకల వల్లే విద్యార్థులకు గుర్తింపు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జేఎన్ గణేష్

కంప్లి, సెప్టెంబరు 18 : ప్రభుత్వ శిక్షణ శాఖ ఏర్పాటు చేసిన ప్రతిభా కారంజి పోటీల వల్ల విద్యార్థులు గుర్తింపుపొందారని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ తెలిపారు. బుధవారం ఎస్ఎన్ పేట క్లస్టర్ ఆధ్వర్యంలో కంప్లి నివేదిత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రతిభా కారంజి పోటీల్లో ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ వేషంలో శ్రావ్య అందరినీ ఆకట్టుకుంది. వారితో పాటు శిక్షణ అధికారి సిద్ధలింగమూర్తి, మల్లన్నగౌడ, సుదర్శన్‌రెడ్డి, నాగన్నగౌడ, బసవరాజు, హనుమంతప్ప, రేణుకారాధ్య, పాల్గొన్నారు.

హోసూరు జోన్

హోసూరు కవి రాజాకు తమిళ వ్యక్తిత్వ పురస్కారం



చెన్నైలోని తిరుకురళ్ సదస్సులో పాల్గొన్న హోసూరు రాజా

హోసూరు సెప్టెంబరు 18 : చెన్నైలోని తమిళ సంఘం తరపున త్యాగరాయ నగర్ రామకృష్ణ ఉన్నత పాఠశాలలో ప్రపంచ తమిళ సంఘం అధ్యక్షుడు సంతోషం నేతృత్వంలో తిరుకురళ్ సదస్సు జరిగింది. ఇందుల్లో 133 అధ్యాయాలకు సంబంధించి ఒక కథనం ప్రచురించారు. వ్యాసం రాసిన రచయితలు, తిరుక్కురళ్ ప్రచారం చేసిన తమిళ పండితుల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. తమిళనాడు డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీస్ తిరునావుక్కరసు తిరుక్కురళ్ ప్రముఖులకు శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా హోసూరు కవి రాజుకు తమిళ వ్యక్తిత్వం పురస్కారం లభించింది. తమిళ సంఘం అధ్యక్షుడు డాక్టర్ ముత్తు, ఢిల్లీ తమిళ సంఘం కార్యదర్శి ముకుందన్, తమిళ అభివృద్ధి శాఖ మాజీ డైరెక్టర్ డాక్టర్ విజయరాఘవన్, చెన్నై మెట్రోపాలిటన్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ అవార్డు గ్రహీతలను అభినందించారు. మున్సిపల్ తమిళ సంఘం అధ్యక్షుడు భారతి సుకుమార్, కార్యదర్శి కవి తంగసార ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అవార్డు గెలుచుకున్న కవిని రాష్ట్ర సాహిత్య బృందం నిర్వాహకులు కృష్ణన్, ఉపాధ్యక్షుడు కవి మురుగకుమారన్, హోసూరు తమిళ సంఘం కార్యదర్శి కవి సేకనాథన్, రోటరీ ఎలైట్ అధ్యక్షుడు శంకర్‌లు, సత్కరించారు.

సబ్‌కలెక్టర్ కార్యాలయ సమీపాన ఖాళీ మద్యం సీసాలు

హోసూరు, సెప్టెంబరు 18: హోసూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ప్రవేశ ద్వారం వద్ద 50 కి పైగా ఖాళీ మద్యం సీసాలు పడిఉండడాన్ని చూసిన ప్రజలు ఇలా కూడా జరుగుతుందా? అని ఆశ్చర్యపోతున్నారు. హోసూరు డెంకణీకోట రోడ్డు బ్రిటీష్ కాలంలో 150 సంవత్సరాల క్రితం నిర్మించిన భవనం ఇది. ప్రస్తుత సబ్ కలెక్టర్ కార్యాలయం, బ్రిటీష్ కాలంలో కలెక్టర్ కార్యాలయంగా ఉండేది. తర్వాత వివిధ జిల్లాలుగా విభజించబడిన తరువాత హోసూరు సబ్ కలెక్టర్ కార్యాలయంగా మారింది. ఇక్కడికి రోజూ వందలాది మంది వస్తుంటారు. కార్యాలయానికి వచ్చేవారికి స్వాగతం పలికేవిధంగా మద్యం బాటిళ్ల పడేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజాసమస్యలను ఆలకించిన కలెక్టర్

హోసూరు(కృష్ణగిరి) సెప్టెంబరు 18: హోసూరు సమీపం మత్తిగిరి, శూలగిరి, ఉద్దన్నపల్లి, డెంకణీకోట, కారుగానపల్లి, ఈచనహళ్లి, రాయకోట, ధర్మపురి, ఫ్లైఓవర్ రోడ్డు పనులను జిల్లా కలెక్టర్ కె.ఎం.సరయు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హోసూరు సర్కిల్ మత్తిగిరి గ్రామంలో జాతీయ రహదారి పనులను కలెక్టర్ పరిశీలించి అనంతరం శూలగిరి సర్కిల్ ఉద్దన్నపల్లి గ్రామంలో సబ్‌వే నిర్మాణంపై ప్రజల అభ్యంతరాలను స్వీకరించారు. అలాగే ఈచనహళ్లి గ్రామం డెంకణీకోట సర్కిల్లో పొలాలను సందర్శించారు. కారుగానహళ్లి గ్రామంల్లో ఇప్పుడే నిర్మిస్తున్న అండర్‌పాస్‌ను పరిశీలించారు. కొత్త ఫ్లైఓవర్ నిర్మించాలని కోరిన ప్రజలను వివరాలుఅడిగి తెలుసుకున్నారు,



జాతీయ రహదారి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

ముద్దటనూరు సహకార సంఘానికి రూ.12.23 లక్షల లాభం



మాట్లాడుతున్న అధ్యక్షుడు సూరిబాబు

కంప్లి, సెప్టెంబరు 18 : శిరిగేరి సమీపంలోని ముద్దటనూరు కృషి పత్తిన సహకార సంఘం 2023-24 నాటికి రూ. 12.23 లక్షల లాభాల బాటలో వుందని, ఆ సంఘం అధ్యక్షుడు సూరిబాబు తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన వార్షికోత్సవంలో ఆయన మాట్లాడుతూ సహకార సంఘంలో రైతుల సహకారం వల్లనే సంఘాలు అభివృద్ధి చెందుతాయన్నారు. 522 రైతులకు నాలుగు పర్సెంట్ ప్రోత్సాహక ధనం పంపిణీ చేశారు. మొత్తం 1350 మంది రైతులు వుండగా రూ.11.84 కోట్లు రుణాలు కల్పించామన్నారు. సహకార సంఘాల వల్ల తక్కువ వడ్డీలకు రైతులకు రుణాలు ఇస్తున్నామన్నారు. నాబార్డు పథకం కింద రూ.24 లక్షలు తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చారన్నారు. ప్రతి ఒక్కరు ఈ సహకార సంఘాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా మెరుగుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు కార్యదర్శి పరశురామ్, అధికారి బాలప్ప, ఉపాధ్యక్షులు నీలకంఠ గౌడ, సభ్యులు శ్రీనివాసరావు, దొడ్డనగౌడ, శాంతమ్మ, మంజునాథ, సత్యనారాయణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



నాగరాజు(ఫైల్)

రాయచూరు సెప్టెంబర్ 18 : రాయచూరు తాలూకాలోని మంజల్లా వద్ద మంగళవారం రాత్రి జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో 28 ఏళ్ల నాగరాజు మృత్యువాతపడ్డాడు. బైక్‌పై వెళుతున్న నాగరాజును ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు ధ్రువీకరించారు. ప్రమా దం జరిగిన వెంటనే యువకుడు అక్కడికక్కడే మృత్యువాతపడగా ట్రాక్టర్ డ్రైవర్ పరారయ్యాడు. ఇందుకు సంబంధించి యరగేరా పోలీసులు హిట్ అండ్ రన్ యాక్సిడెంట్‌గా కేసు నమోదు చేశారు.

పీడీఓపై చర్యలకు డిమాండ్

రాయచూరు సెప్టెంబర్ 18: అధికార దుర్వినియోగానికి పాల్పడిన లింగసుగూరు తాలూకా సర్జాపూర్ గ్రామ పంచాయతీ పీడీఓపై చర్యలు తీసుకోవాలని యరడోణ గ్రామీణ కూలి కార్మికుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కూలి కార్మిక సంఘం అధ్యక్షుడు గుండప్ప పేరున బుధవారం ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. పీడీఓ శోభారాణి తన స్వంత గ్రామం సర్జాపూర్‌లోనే విధులు నిర్వహిస్తూ తన భర్త పేరుపై ఉన్న భూమిలో నిబంధనలకు విరుద్ధంగా కృషి హోండ(వ్యవసాయబావి)నిర్మించినట్లు ఆరోపించారు. ఇందుకోసం ప్రభుత్వ సబ్సిడీ పొందారని ఇది నిబంధనలకు విరుద్ధమన్నారు. ఆమె భర్త ప్రభుత్వ టీచర్‌గా పని చేస్తున్నారని నెలకు లక్ష రూపాయిలకుపైగా వేతనం పొందుతున్నాడని ఆమె భర్తకు నిబంధనలకు విరుద్ధంగా బావి ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

తాపీ ధర్మారావు (జయంతి)



ప్రముఖ రచయిత తాపీ ధర్మారావు 1887 సెప్టెంబరు 19న ఒడిశా రాష్ట్రం బర్హంపురలోని తెలుగు కుటుంబంలో జన్మించారు. తెలుగు భాషా పండితుడు, హేతువాది, నాస్తికుడు. ఆయనను గౌరవంగా 'తాతాజీ' అని పిలిచేవారు. సమదర్శిని, జనవాణి, కాగడా తదితర పత్రికలకు సంపాదకులుగా వ్యవహరించారు. ఆయన జయంతిని 'తెలుగు మాధ్యమాల దినోత్సవం'గా ఆచరిస్తున్నారు. 1926లో శృంగేరీ పీఠాధిపతిచే 'ఆంధ్ర విశారద' బిరుదు పొందారు. 1971లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, ఇతర గౌరవాలు అందుకున్నారు. 1973 మే 8న తుదిశ్వాస విడిచారు.

బోయి భీమన్న (జయంతి)



'పద్మభూషణ్' గ్రహీత బోయి భీమన్న 1911 సెప్టెంబరు 19న తూర్పు గోదావరి జిల్లా మామిడికుదురు గ్రామంలో జన్మించారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. సామాజిక చైతన్యంకోసం 70కుపై రచనలు చేశారు. అంబేడ్కర్ రాసిన 'కుల నిర్మూలన' పుస్తకాన్ని తెలుగులోకి అనువాదం చేశారు. ఆకాశవాణిలో ప్రసారం కోసం పలు భావగీతాలు రాశారు. ఆంధ్రా యూనివర్సిటీ సెనేట్ సభ్యుడిగా వ్యవహరించారు. కళాప్రపూర్ణ, కళారత్న, పద్మశ్రీ, కేంద్ర సాహిత్య అకాడమీ తదితర పురస్కారాలు అందుకున్నారు. 2005 డిసెంబరు 16న కన్నుమూశారు. కాగా ఆయన గౌరవార్థం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'బోయి భీమన్న సాహిత్య పీఠం' నిర్వహించబడుతోంది.

యు. శ్రీనివాస్ (వర్ధంతి)



మాండొలిన్ వాద్యకారుడిగా దేశంలో పేరొందిన 'పద్మశ్రీ' ఉప్పలపు శ్రీనివాస్ 1969 ఫిబ్రవరి 28న పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో జన్మించారు. 15 ఏళ్లప్రాయంలోనే తమిళనాడు రాష్ట్ర ఆస్థాన పదవిని అలంకరించారు. కర్ణాటక శాస్త్రీయ సంగీతంలో ఎలక్ట్రిక్ మాండొలిన్‌ను ఉపయోగించిన తొలి సంగీతకారుడు. రాగాలకు స్వరాలకు అనుకూలంగా మాండొలిన్‌ను రూపొందించారు. కంచి కామకోటి పీఠం, శ్రీకాళహస్తి ఆలయం, మంత్రాలయ రాఘవేంద్రమఠం, పిల్లయరపట్టి ఆలయాలకు 'ఆస్థాన విద్వాన్'గా వ్యవహరించారు. 137 ఆల్బమ్స్ రూపొందించారు. సనాతన సంగీత పురస్కార్, రాజాలక్ష్మి ఫౌండేషన్ అవార్డు తదితర పురస్కారాలు అందుకున్నారు. 2014 సెప్టెంబరు 19న కన్నుమూశారు.

మెడికల్ కళాశాలలో సంబరాలు

● సీట్లు పెంచడంపై హర్షం



వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యాలరావును సత్కరిస్తున్న ప్రొఫెసర్లు

అనంతపురంటౌన్, సెప్టెంబరు 18: ఎంబీబీఎస్ సీట్లు పెంచడంపై బుధవారం మెడికల్ కళాశాలలో సంబరాలు చేసుకున్నారు. ఇప్పుడు ఉన్న 150 ఎంబీబీఎస్ సీట్లకు అదనంగా మరో 50 సీట్లు పెంచి ఈ విద్యా సంవత్సరం నుంచే అవకాశం కల్పిస్తూ జాతీయ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో కళాశాలలో ప్రొఫెసర్లు, డాక్టర్లు, మెడికోలు సంబరాలు చేసుకున్నారు. దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న కల నెరవేరడంతో ఆనందం ఉప్పొంగింది. ఇందుకు పట్టుదలగా కృషి చేసిన ప్రిన్సిపాల్ మాణిక్యాలరావును సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అందరి సహకారంతో అదనంగా 50సీట్లు పెంచుకోగలిగామన్నారు. గత ఆరు నెలలుగా కష్టపడుతున్నా వివిధ కారణాలతో వాయిదా పడుతూ వచ్చిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు నవీన్‌కుమార్, షంషాద్ బేగం, షారోన్‌సోనియా, శ్యాంప్రసాద్, ప్రవీణ్‌దీన్‌కుమార్, పద్మ శ్రావణి, శ్రీనివాసరావు, మధుసూదన్, బసిరెడ్డి, ప్రవీణ, మల్లిక, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఫలితాలు విడుదల

కొత్తచెరువు, సెప్టెంబరు 18: టెక్నికల్ కోర్సులకు సంబంధించిన ఫలితాలు విడుదలయ్యాయని శ్రీసత్యసాయి జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షి తెలిపారు. డ్రాయింగ్‌లో లోయర్, హయ్యర్ అన్‌లూమ్ వీవింగ్‌లో లోయర్, హయ్యర్, టైలరింగ్, ఎంబ్రాయిడరింగ్‌లో లోయర్, హయ్యర్ పరీక్షలను ఏప్రిల్‌లో నిర్వహించామని, వాటి ఫలితాలను ప్రభుత్వం బుధవారం విడుదల చేసిందని వివరించారు. ఉత్తీర్ణత, మార్కుల జాబితాను www.bse.ap.gov.inలో పొందవచ్చని పేర్కొన్నారు.

గడువు పొడిగింపు

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షలకు దరఖాస్తు గడువు ఈ నెల 24 వరకు ప్రభుత్వం పొడిగించిందని శ్రీ సత్యసాయి జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. www.bse.ap.gov.inలో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఆధార్ కార్డులో ఉన్న విధంగా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునేందుకు ఎటువంటి ధృవపత్రాలు అవసరం లేదని, పరీక్షలు రాసే సమయానికి అన్ని సిద్ధం చేసుకోవాలని అన్నారు. పరీక్ష రుసుం ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.50 చెల్లించాలన్నారు. దరఖాస్తు ప్రింటెడ్ నామినల్‌రోల్, ఒరిజనల్ ఎస్‌బీఐ కలెక్టు రసీదును జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఈ నెల 27లోగా అందించాలని సూచించారు.

జీడిపల్లికి 909 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 18: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు బుధవారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 909 క్యూసెక్కులు వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 864 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉందని, ప్రస్తుతం రిజర్వాయర్‌లో నీటి నిల్వ 1.675 టీఎంసీలు ఉందని అధికారులు వెల్లడించారు.

టమోటా కిలో రూ.36

అనంతపురం రూరల్, సెప్టెంబరు 18: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.36తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు బుధవారం 2,250 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయని తెలిపారు. కిలో గరిష్ఠ ధర రూ. 36, సరాసరి ధర రూ.29, కనిష్ఠ ధర రూ.20పలికినట్లు ఆయన తెలిపారు.

సమస్యలను పరిష్కరించకుంటే సమ్మె బాటే

▸▸ పంచాయతీరాజ్ ఉద్యోగుల హెచ్చరిక



మీడియా సమావేశంలో పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం పదాధికారులు

బెంగళూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించకుంటే అక్టోబరు 4 నుంచి సమ్మెబాట పడతామని గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్‌శాఖ ఉద్యోగులు హెచ్చరించారు. గాంధీభవన్‌లో బుధవారం అధికారులు, ఉద్యోగుల సంక్షేమసంఘం ముఖ్యులు మీడియాతో మాట్లాడారు. అధికారుల సంఘం అధ్యక్షుడు రాజు వారద, గ్రామపంచాయతీ ఐక్య కూటమి రాష్ట్ర అధ్యక్షుడు కాడశెట్టిహళ్ళి సతీశ్, డిఎ రమేశ్ తదితరులు మాట్లాడుతూ 30ఏళ్లుగా సిబ్బంది పెరగలేదని కానీ రిట్రైర్మెంట్‌లు సాగుతున్నాయన్నారు. ఉన్న సిబ్బందిపై పనిభారం పెరుగుతోందన్నారు. ఏడేళ్ల తర్వాత బదిలీ చేయాలనే నిబంధన వీడాలన్నారు. పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించకుంటే నిరసన తప్పదన్నారు. గ్రేడ్-2 కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు జగదీశ్ మణ్ణనవర్, అకౌంటెంట్స్ సంఘం అధ్యక్షుడు మహంతేశ్ కోత, డేటా ఎంట్రీ ఆపరేటర్స్ సంఘం అధ్యక్షుడు బీమరెడ్డి పాటిల్, పన్నులవసూళ్ల సిబ్బంది సంఘం అధ్యక్షుడు లింగేశ్, వాటర్‌మ్యాన్‌ల సంఘం అధ్యక్షుడు రామకృష్ణప్ప, జవాన్ల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, పౌరకార్మికుల సంఘం అధ్యక్షుడు బిఎ నితిన్‌లు పాల్గొన్నారు.

డెయిరీల అభివృద్ధిలో రాజకీయాలు వద్దు



సమావేశం ప్రారంభంలో డాల్ఫిన్ నాగరాజ్ తదితరులు

శిడ్లఘట్ట, సెప్టెంబరు 18: పాలడెయిరీల అభివృద్ధిలో రాజకీయాలు వద్దని డీసీసీ బ్యాంకు మాజీ ఉపాధ్యక్షుడు డాల్ఫిన్ నాగరాజ్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని నల్లిమరదహళ్ళి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం నూతన భవనం ప్రారంభం, సర్వసభ్యుల సాధారణ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సంఘం ఏదైనా పాలకవర్గాలు కలసికట్టుగా ఉండి ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని రాజకీయాలకు అవకాశం ఇవ్వరాదని సూచించారు. భవనాన్ని ఎమ్మెల్యే బిఎన్ రవికుమార్ లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం సమావేశాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ కోచిముల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రామయ్య తాలూకాలో 1983 నుంచి క్రియాశీలకంగా ఉంటున్నారన్నారు. జిల్లా సహకార సమాఖ్య అధ్యక్షుడిగా ఉత్తమ ప్రగతి సాధించారన్నారు. ఎంతోమంది రైతులు నేటికీ పాడిరంగాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్నాయన్నారు. పశువులకు తప్పకుండా ఆరోగ్య బీమా చేయించాలని సూచించారు. కోచిముల్ మాజీ అధ్యక్షుడు గుడియప్ప మాట్లాడుతూ ఆరోగ్యబీమా చేయించిన తర్వాత ఒకవేళ పశువు మృతి చెందితే గరిష్ఠంగా రూ.70వేల వరకు పరిహారం పొందే అవకాశం ఉందన్నారు. కోచిముల్ డిప్యూటీ మేనేజర్ రవికిరణ్ మాట్లాడుతూ నాణ్యమైన పాలను అందించడం ద్వారా లాభాలను గడించి ఆర్థిక పురోగతి సాధించాలన్నారు. ఇదే సందర్భంగా ప్రముఖులకు, సంఘం సభ్యులను ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో నల్లిమరదహళ్ళి సహకారసంఘం అధ్యక్షుడు నరసింహమూర్తి, ఒక్కలిగ సంఘం అధ్యక్షుడు నారాయణస్వామి, నగరసభ ఉపాధ్యక్షులు రూపనవీన్, సభ్యుడు లక్ష్మణ, రైతుసంఘం ప్రముఖులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు ఉచిత ఆరోగ్య శిబిరం

బాగేపల్లి, సెప్టెంబరు 18: దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన రవాణా విభాగానికి చెందిన డ్రైవర్‌లు ప్రతి ఆరు నెలలకోసారి తమ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని నేషనల్ పీయూ కాలేజ్ రిటైర్డు ప్రిన్సిపాల్ కెటి వీరాంజనేయ అభిప్రాయపడ్డారు. పట్టణ శివారులోని జాతీయ రహదారి 44పై గంగోత్రి పెట్రోల్‌బంకు ఆవరణలో అంతర్జాతీయ వాహన డ్రైవర్‌ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, తాలూకా ఆరోగ్యశాఖ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ మన సైనికులు దేశ భద్రతలో నిమగ్నమై ఉంటారని వారు కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ విధులు నిర్వహిస్తుంటారన్నారు. అలాగే ప్రజలకు అవసరమైన నిత్యావసరాలు ఇతరత్రా వాటి రవాణాలో డ్రైవర్‌లపాత్ర కీలకమన్నారు. డ్రైవర్‌లు తమ ఆరోగ్యం కోసం ప్రతి ఆరు నెలలకోసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆరోగ్యంపట్ల నిర్లక్ష్యం చేయరాదన్నారు. పాన్‌మసాలా, గుట్కా, పొగాకుతోపాటు మాదకద్రవ్యాల వాటి జోలికి పోరాదన్నారు. తాలూకా ఆరోగ్యాధికారి డాక్టర్ సీఎస్ సత్యనారాయణరెడ్డి, డాక్టర్ వెంకటరవణ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థ విభాగం మేనేజర్ సౌరవ్‌పాల్, గంగోత్రి పెట్రోలియం బంక్ ముఖ్యులు శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో వైద్య పరీక్షలు, పాల్గొన్న ప్రముఖులు

నీటి సమస్యకు త్వరలో శాశ్వత పరిష్కారం



కళ్లద్దాలు అందచేస్తున్న మాజీ ఎంపీ సురేశ్

బొమ్మనహళ్ళి, సెప్టెంబరు 18: కావేరి నీరు ఐదో స్టేజ్‌ద్వారా బేగూరు, ఎలక్ట్రానిక్‌సిటీ తదితర ప్రాంతాలకు నీరు వదలడానికి సిద్ధంగా ఉందని మాజీ ఎంపీ డీకే సురేశ్ తెలిపారు. ఇకపై కావేరి నీటికి సమస్య ఉండదన్నారు. సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ త్వరలోనే ప్రారంభిస్తారన్నారు. బుధవారం బేగూరు వార్డులో గ్యారెంటీ పథకాల అమలు కార్యాలయాన్ని ప్రారంభించారు. బీబీఎంపీ పరిధిలో గ్యారెంటీ పథకాల కమిటీ బేగూరు వార్డు అధ్యక్షుడు మాజీ కార్పొరేటర్ ఆంజనప్ప, గ్యారెంటీ కమిటీ బెంగళూరు నగర జిల్లా అధ్యక్షుడు క్రిష్ణప్ప, బెంగళూరు దక్షిణకు చెందిన ఓ మంజునాథ్, కాంగ్రెస్ నాయకుడు ఆర్‌కే రమేశ్, టి వాసుదేవరెడ్డి, కిరణ్, సంపత్, అక్రం బాషా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు గ్యారెంటీలను విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. అయితే బీజేపీ మాత్రం దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. కాగా బీపీఎల్ కార్డులను నిజమైన లబ్ధిదారుల ఎంపికలో కొన్ని కోతలు తప్పడం లేదన్నారు. ఇళ్ల తదితర నిర్మాణాలకు సంబంధించి ఈసీ, ఖాతా వంటివి ఆన్‌లైన్ సర్వీసులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నాయన్నారు. ప్రజలకు అన్ని విధాలా మెరుగైన సేవలు ఉంటాయన్నారు. కంటి పరీక్షా శిబిరం సందర్భంగా ఎంపికైన వారికి ప్రస్తుతం ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు.

ప్రతివార్డులో స్వచ్ఛతా కార్యక్రమం

బంగారపేట, సెప్టెంబరు 18: కోలారు జిల్లాలో ఉత్తమ పురసభగా పేరొందిన బంగారపేట పురసభ పరిధిలో డెంగీ వంటి జ్వరాలు ప్రబలకుండా పురసభ నూతన అధ్యక్షుడు గోవింద, ముఖ్యఅధికారి సత్యనారాయణ నేతృత్వంలో ప్రతివార్డులో స్వచ్ఛతా కార్యక్రమం నిర్వహించారు. బుధవారం 27వ వార్డులో స్వచ్ఛతా పనులను స్వయంగా పరిశీలించారు. పట్టణంలోని శాంతినగర్‌లో పౌరకార్మికుల నేతృత్వంలో స్వచ్ఛతా అభియానపై ప్రజల్లో అవగాహన కల్పించారు. కారహళ్ళి సర్కిల్‌లో హైమాస్ దీపాలు కిందపడిన వెంటనే అధికారులు స్పందించి మూడు రోజుల్లో బాగు చేసిన అంశం విదితమే. ఈ సందర్భంగా పురసభ అధ్యక్షుడు గోవింద మాట్లాడుతూ ఎమ్మెల్యే నారాయణస్వామి మార్గదర్శకంలో అన్ని వార్డులలోనూ స్వచ్ఛత పాటించడంతోపాటు డ్రైనేజీలలో పూడికతీత పనులు కొనసాగుతు న్నాయన్నారు. ఇలా నెలరోజులపాటు ప్రత్యేక స్వచ్ఛతా అభియాన ఉంటుందన్నారు. మార్కెట్, బస్టాండ్, దుకాణాల వద్ద చెత్తను ఇష్టం వచ్చినట్టు పడేయకుండా పురసభ కంటైనర్‌లలో వేయాలని సూచించారు. దోమల నియంత్రణకు త్వరలో ఫాగింగ్ చేపడతామన్నారు. పురసభ సభ్యులు వెంకటేశ్, రత్నమ్మ తిమ్మయ్య, ప్రముఖుడు కిట్టణ్ణ, పురసభ అధికారులు సంతోష్, గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛతా పనుల్లో పౌరకార్మికులు

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

శిడ్లఘట్ట, సెప్టెంబరు 18: తాలూకాలోని మళమాచనహళ్ళిలో గ్రామదేవత గంగమ్మ దేవాలయం రోడ్డు, కైలాసపాళ్యలో డ్రైనేజీ, కాంక్రీట్ రోడ్డు పనులకు ఎమ్మెల్యే బిఎన్ రవికుమార్ బుధవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మళమాచనహళ్ళి గ్రామంలో ఎంతోకాలంగా డిమాండ్ ఉన్న పనులకు ఎమ్మెల్యే గ్రాంట్ల ద్వారా గ్రామస్థుల సహకారంతో నెరవేర్చినట్టు తెలిపారు. గడువులోగా పనులు పూర్తి చేయాలని కంట్రాక్టర్‌కు సూచిస్తూనే నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామంలోనూ రోడ్లు సుందరంగా ఉండాలనేది తన అభిలాష అన్నారు. తాలూకా పంచాయతీ మాజీ అధ్యక్షుడు ఎంకే రాజశేఖర్ మాట్లాడుతూ ఆలయాలకు వెళ్లే మార్గాలు దుస్థితిలో ఉండగా ఎమ్మెల్యే గ్రాంట్లతో అభివృద్ధికి నోచుకోనున్నాయన్నారు. యువ ప్రముఖుడు ఎంజి నవీన్‌కుమార్, తాదూరు రఘు, గ్రామపెద్ద ఎంసి జగదీశ్, రమేశ్, అశోక్, ఎస్ఎఫ్‌సిఎస్ డైరెక్టర్ దేవరాజ్, ఎంపిసిఎస్ అధ్యక్షుడు రామచంద్రాచారి, డైరెక్టర్ సతీశ్, కంట్రాక్టర్ మంజునాథ్, గంగమ్మ దేవాలయ, సప్పలమ్మ దేవాలయ కమిటీ సభ్యులు, జేడీఎస్ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టిన శిశువుకు నరేంద్రమోదీ పేరు

బెంగళూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ పుట్టినరోజున జన్మించిన మగశిశువుకు కొడగు జిల్లాకు చెందిన దంపతులు 'నరేంద్ర' అని పేరు పెట్టారు. కొడగు జిల్లా కుశాలనగర తాలూకా సుందరనగరకు చెందిన జయలక్ష్మి, మహేంద్ర దంపతులకు మంగళవారం మగశిశువు జన్మించారు. ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజున సందడి నెలకొన్న తరుణంలోనే శిశువుకు కూడా 'నరేంద్ర' అని పేరు పెట్టి ఆకట్టుకున్నారు. తమబిడ్డ కూడా ప్రధాని మోదీ అంతటి ఉన్నతస్థాయిలో పేరొందాలని కోరుతూ పేరు పెట్టామని తల్లిదండ్రులు సంబరపడ్డారు.

శుద్ధ జలంతోనే ఆరోగ్యం

విజయపుర, సెప్టెంబరు 18: శుద్ధతాగునీరు వాడకం ద్వారా మెరుగైన ఆరోగ్యం సాధ్యమని టౌన్ ఇన్నర్‌వీల్ సంస్థ అధ్యక్షురాలు ప్రేమా నాగరాజప్ప అభిప్రాయపడ్డారు. ప్రత్యేకించి పాఠశాల విద్యార్థుల ప్రయోజనం కోసం దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణం ఇందిరానగర్‌లోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు ఇన్నర్‌వీల్ సంస్థ ఆధ్వర్యంలో శుద్ధతాగునీటి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సంస్థ జిల్లా మాజీ అధ్యక్షురాలు ఆశా శైలింద్ర మాట్లాడుతూ తాగునీటిని వృథా చేయరాదని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ సంస్థ డైరెక్టర్‌లు వీణా నటశేఖర్, రీటా నాగరాజ్, భారతిరాజ్, సుష్మా అశోక్, మానస ప్రదీప్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునిపాపు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఫిల్టర్‌వాటర్ ఏర్పాటులో ఇన్నర్‌వీల్ సంస్థ ప్రతినిధులు, తదితరులు

సత్యసాయి సేవలు అమోఘం



ఆర్జే రత్నాకర్‌తో ఇండోనేషియా బృందం

అనంద్‌కృష్ణ గురుజీ.. ఆర్జే రత్నాకర్‌తో ఇండోనేషియా భక్తుల భేటీ

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 18: ప్రపంచ ఆధ్యాత్మిక గురువు సత్యసాయిబాబా సేవలు అమోఘం, ఆచరణీయమని ఇండోనేషియాకు చెందిన ఆనంద్‌కృష్ణగురుజీ కొనియాడారు. ఇండోనేషియాకు చెందిన 15 మంది సభ్యుల బృందం బుధవారం జిల్లాకేంద్రంలోని ప్రశాంతి నిలయం చేరుకుని, శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్‌తో భేటీ అయ్యారు. వారు మాట్లాడుతూ.. ఎందరో అవతారమూర్తులు భారతదేశంలో జన్మించడం భరతజాతి చేసుకున్న పుణ్యమన్నారు. సంస్కృతీసంప్రదాయాల్లో భారత్‌కు ప్రపంచంలో మరేదేశమూ సాటిలేదన్నారు. సత్యసాయిబాబా స్ఫూర్తితో ఇండోనేషియాలోని జకర్తా, బాలిలో ఎన్నో సేవాకార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సత్యసాయిబాబా వైభవాన్ని ట్రస్టువారు ముందుకు తీసుకెళ్తున్న విధానం అభినందనీయమన్నారు. అనంతరం ఇండోనేషియా బృంద సభ్యులకు బాబా చిత్రపటాలు, ప్రసాదం అందజేశారు.

ప్రపంచ టాప్ 2శాతం శాస్త్రవేత్తల్లో గీతం ప్రొఫెసర్ కడియాల



ప్రొఫెసర్ కడియాల చంద్రబాబునాయుడు

బెంగళూరు, సెప్టెంబరు 18 (ఆంధ్ర జ్యోతి): అమెరికాలోని స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రకటించిన అత్యంత ప్రతిభావంతులైన టాప్2శాతం శాస్త్రవేత్తల జాబితాలో కడప జిల్లా కాశినాయన మండలం ఇటగుళ్లపాడు గ్రామానికి చెందిన కడియాల చంద్రబాబునాయుడు వరుసగా ఐదోసారి చోటు దక్కించుకున్నారు. వ్యవసాయ కుటుంబంలో పుట్టిన ఈయన మెటీరియల్ సైన్స్ విభాగంలో నిరంతరం పరిశోధనలతో డాక్టరేట్ పొందారు. 2018లో గీతం యూనివర్సిటీ బెంగళూరు క్యాంపస్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. మెటీరియల్ సైన్స్ విభాగంలోని ఫైరెట్స్, టైటానేట్స్, నాన్ కాంపోజిట్ అనే అంశాలపై పరిశోధనలు కొనసాగించారు. 132 పరిశోధనా పత్రాలు, 4 పుస్తకాలు, 2 పేటెంట్‌లు, 2 పీహెచ్‌డీలు సాధించారు. పరిశోధనాపత్రాలను ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పరిశోధకులకు అనుసరిస్తూ సూచించడంలో కడియాలకు గుర్తింపు లభించింది. 2019-20 లో మొదటిసారిగా 3,38,593వ ర్యాంకును 190 అనులేఖనాలతో సాధించారు. 2020-21లో 2,38,368 ర్యాంకును 430 అనులేఖనాలతోనూ, 2021-22లో 1,98,643వ ర్యాంకును 330 అనులేఖనాలతోనూ, 2022-23లో 1,59,222 ర్యాంకును 454 అనులేఖనాలతోనూ, 2023-24 లో 1,25,258వ ర్యాంకును 604 అనులేఖనాలతో సాధించారు. ఈ గుర్తింపునకు ప్రపంచవ్యాప్తంగా 2,23,152 మంది శాస్త్రవేత్తలను గుర్తించగా ప్రొఫెసర్ కడియాలకు 1,20,494వ స్థానం లభించింది. ప్రస్తుతం ఆయన గీతం యూనివర్సిటీ క్యాంపస్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు.

నైపుణ్యాన్ని పెంచడమే కరికులమ్ లక్ష్యం

బెంగళూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచస్థాయిలో ఉద్యోగాల సాధనకు నైపుణ్యత పెంచడమే కరిక్యులమ్ అసోసియేట్స్ లక్ష్యమని సీఈఓ రాబ్‌వాల్డన్ అభిప్రాయపడ్డారు. బెంగళూరులో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను బుధవారం లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాల్డన్ మాట్లాడుతూ కరిక్యులమ్ అసోసియేట్స్ ప్రింటింగ్, డిజిటల్ ఎవాల్యుయేషన్, డయాగ్నస్టిక్స్ బోధనాసామగ్రి అభివృద్ధిలో కీలకంగా వ్యవహరిస్తోందన్నారు. యూఎస్‌లో 13 మిలియన్లమంది కంటే ఎక్కువమంది విద్యార్థులకు సేవలందిస్తోందన్నారు. 55ఏళ్లకుపైగా సేవలందిస్తోందన్నారు. బెంగళూరులో కార్యాలయం ఆరంభం సంతోషమని సంస్థ ఇండియా ఉపాధ్యక్షుడు రాజీవ్‌కపూర్ తెలిపారు. ప్రతిభావంతులను రూపొందించడం అధ్యాపకులు, విద్యార్థులకు సామర్థ్యానికి మించి సేవలందించడమే తమ సంస్థ ఆశయమన్నారు. విశ్వవ్యాప్తంగా భారతీయ ప్రతిభావంతులను నియమించుకునేందుకు సంస్థ పనిచేస్తుందన్నారు.

కేపీసీసీ జనరల్ సెక్రటరీపై వేటు

బెంగళూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సౌమ్యరెడ్డి నియామకాన్ని తప్పుబడుతూ ఆరోపణలు చేసిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కవితారెడ్డిని పార్టీనుంచి సస్పెండ్ చేశారు. పార్టీ ద్వారా కేటాయించిన పలు బాధ్యతలనుంచి ఆమెను తప్పిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ క్రమశిక్షణా సంఘం అధ్యక్షుడు రెహమాన్‌ఖాన్ ఆదేశాలు జారీ చేశారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్ష పదవిపై తీవ్రమైన పోటీ సాగింది. సౌమ్యరెడ్డిని నియమించడాన్ని కవితారెడ్డి తప్పుపట్టారు. ఎమ్మెల్యేగా ఓటమి చెందినా సౌమ్యరెడ్డికి ఎంపీ టిక్కెట్ ఇచ్చారని, అక్కడా ఓడిపోతే ఏకంగా మహిళా కాంగ్రెస్ అధ్యక్ష పదవి కట్టబెట్టారని, ఒక మంత్రి కుమార్తె అయినందుకే ఇలా వ్యవహరిస్తారా..? అంటూ ప్రశ్నించారు. పార్టీ అంతర్గత విషయాన్ని బహిరంగంగా విమర్శించడాన్ని పార్టీ తప్పుబట్టింది. 7 రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసు జారీ చేసినా విస్మరించడంతో ఏకంగా బుధవారం ఆమెపై సస్పెన్షన్ వేటు వేశారు.

దరఖాస్తు చేసుకున్నవారికే ఇసుక : కలెక్టర్

పుట్టపర్తి, సెప్టెంబరు 18: ఇకపై ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికే ఇసుక సరఫరా చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. ఉచిత ఇసుక సరఫరాకు నూతన మార్గదర్శకాల అమలుపై స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గురువారం నుంచి నూతన మార్గదర్శకాలు అమలులోకి వస్తాయన్నారు. ఆ మేరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికే ఇసుక సరఫరా చేస్తామన్నారు. ఇసుక తరలించే వాహనాలు సైతం రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వ్యక్తిగతంగాగానీ, గ్రామ, వార్డు సచివాలయాల్లోగానీ ఇసుక కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రీచ్‌లు, స్టాక్‌పాయింట్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే లోడింగ్ చేయాల్సి ఉంటుందనీ, రోజుకు 60 వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ముదిగుబ్బ, తాడిమర్రి మండలాల్లోని పెద్దచిగుళ్ల రేవు, చిన్నచిగుళ్లరేవు రీచ్‌ల నుంచి గురువారం నుంచి ఇసుక సరఫరా చేస్తామన్నారు. అందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. సమీక్షలో జేసీ అభిషేక్‌కుమార్, ఏఎస్పీ శ్రీనివాసులు, గనుల శాఖాధికారి రాంమోహన్, జలవనరుల శాఖాధికారి మల్లికార్జునరావు, ఆర్డీఓలు భాగ్యరేఖ, వెంకటశివారెడ్డి, డీఎల్డీఓ శివకుమారి, ఆర్టీఓ కరుణాసాగర్‌రెడ్డి పాల్గొన్నారు.